క్లుప్తంగా

17న 'జగనన్నకు చెబుదాం'

భట్టిప్రోలు: ఈ నెల 17వ తేదీన భట్టిప్రోలు వ్యవసాయ మార్కెట్ యార్డులో జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా ఆధ్వర్యంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం మండల స్థాయిలో నిర్వహించనున్నట్లు ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు కూడా పాల్గొంటారని తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు అందరూ హాజరవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని భట్టిప్రోలు మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేమూరు- బాపట్ల ఆర్టీసీ బస్సు ప్రారంభం



వేమూరు: వేమూరు నుంచి జిల్లా బాపట్ల కేంద్రం వరకు బస్సు సౌకర్యం కల్పించడం జరిగిందని ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్చార్జి పోకల నాగేశ్వరావు తెలిపారు. వేమూరు బస్‌స్టాండ్ నుంచి బస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున చొరవతో బస్సు సౌకర్యం ఏర్పాటయిందని అన్నారు. సీపీఎం వేమూరు నియోజక వర్గ నాయకుడు బొనిగల ఆగస్టీన్ మాట్లాడుతూ సెలవులు రోజుల్లో, కార్తిక మాసంలో బస్సును సూర్యలంక వరకు పొడిగించాలని ఆయన కోరారు. వేమూరు, కొల్లూరు, వెల్లటూరు, భట్టిప్రోలు పాయింట్‌ల్లో బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

పట్టణ ఎస్‌ఐ హరిబాబు బాధ్యతలు స్వీకరణ



రేపల్లె రూరల్: రేపల్లె పట్టణ ఎస్‌ఐ హరిబాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. క్రోసూరులో విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీపై రేపల్లెకు విచ్చేశారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ అబ్దుల్ రజాక్ వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా హరిబాబు సీఐ నజీర్‌బేగ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణకు శక్తివంచన లేకుండా పని చేస్తానని చెప్పారు. బాధ్యతలు స్వీకరించిన హరిబాబుకు స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆశా వర్కర్లు నిబద్ధతతో పనిచేయాలి

ఆశా డే కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ రోహిణి

భట్టిప్రోలు: సామాజిక స్వచ్ఛంద ఆరోగ్య కార్యకర్తలు(ఆశా) విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేయాలని డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ మెడికల్ ఆఫీసర్ (డీపీఎంఓ) డాక్టర్ రోహిణి కోరారు. భట్టిప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే నిర్వహించారు. ఈ సందర్భంగా రోహిణి మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు ప్రతి నిత్యం తమకు నిర్దేశించిన ఏరియాలలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఇళ్లను సందర్శించాలన్నారు. అప్పుడే ప్రభుత్వ వైద్యశాలలపై వారికి నమ్మకం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలు ప్రతి కుటుంబానికి తెలియచేయాలని తెలిపారు. జనన, మరణాలకు సంబంధించిన వివరాలను ఏఎన్ఎంలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ (డీపీఓ) ప్రేమ పావని, డిస్ట్రిక్ట్ ఆశా నోడల్ ఆఫీసర్ సుజాత, మెడికల్ ఆఫీసర్లు సీహెచ్ రామలక్ష్మి, ఎ.శ్రీనివాసరావు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు యాత్రను జయప్రదం చేయాలి

భట్టిప్రోలు: సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్రంలో నిర్వహిస్తున్న ప్రజా రక్షణ ప్రచార భేరీ బస్సు యాత్ర బుధవారం భట్టిప్రోలుకు చేరుకుంటుందని ఆ పార్టీ బాపట్ల జిల్లా కార్యవర్గ సభ్యుడు టి.కృష్ణమోహన్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కృష్ణమోహన్ మాట్లాడుతూ స్థానిక రథం సెంటర్లో జరిగే బస్సు యాత్ర బహిరంగ సభను జయప్రదం చేయాలని ప్రచారం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్, ఎస్.పుణ్యవతి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు డి.రమాదేవి, బాపట్ల జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను వినతి పత్రాల రూపంలో నాయకులకు అందించవచ్చునని పేర్కొన్నారు. సీపీఎం మండల కార్యదర్శి జి.సుధాకర్, సభ్యులు ఎం. సత్యనారాయణ, జి. నాగరాజు, బి.నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరి

ఆర్డీఓ హేలా షారోన్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ హేలా షారోన్

రేపల్లె రూరల్: అనుమతులు లేకుండా ఎవరైనా బాణసంచా విక్రయశాలలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని ఆర్డీఓ హేలా షారోన్ అన్నారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో మంగళవారం వివిధ శాఖల అధికారులు, వ్యాపారులతో ఆమె మాట్లాడారు. గృహాల మధ్యగాని, అనుమతులు లేని ప్రాంతాలలో గాని మందుగుండు విక్రయశాలలు ఏర్పాటు చేయటం నిబంధనలకు విరుద్ధమన్నారు. ప్రభుత్వం కేటాయించిన స్థలంలోనే ఈ తాత్కాలిక దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకునే వ్యాపారులు అధికారుల నుంచి అనుమతులు తప్పసరిగా తీసుకోవాలన్నారు. మందుగుండు సామగ్రి నిల్వ చేసే గోడామ్‌లు నివాస ప్రాంతాలకు దూరంగా ఉండాలని చెప్పారు. అధికారులు వ్యాపారుల నుంచి నిర్ణీత రుసుము మాత్రమే వసూలు చేయాలని, ఎటువంటి లాలూచీలకు, ప్రలోభాలకు పాల్పడినా సహించేదిలేదని చెప్పారు. డివిజన్ పరిధిలో తాత్కాలిక దుకాణాలు నిర్వహించే వ్యాపారులు మున్సిపాలిటీ, పంచాయతీ, పోలీసు, ఫైర్, రెవెన్యూ, ఎలక్ట్రిసిటీ శాఖల నుంచి అనుమతులు తప్పనిసరిగా పొందాలని సూచించారు. సమావేశంలో వివిధశాఖల అధికారులు, వ్యాపారులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలు తెలపాలి..

డివిజన్ పరిధిలో ఇప్పటికే బీఎల్వోలతో ఓటర్ల జాబితాల వివరాలను పరిశీలించటం జరిగిందని ఆర్డీఓ హేలా షారోన్ తెలిపారు. ఓటర్ల జాబితాలపై స్థానిక కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆమె సమావేశమై మాట్లాడారు.

రేపటి నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాలు

కర్లపాలెం: మండలంలో ఈనెల 9వ తేదీ నుంచి 23వరకు గ్రామ సచివాలయాల వద్ద తొలివిడతగా 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాలు జరుగుతాయని గ్రామ, మండలస్థాయి అధికారులు పాల్గొనాలని ఎంపీడీఓ దాసరి రాంబాబు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో తొలి విడతగా పది గ్రామ సచివాలయాలలో జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. ఈనెల 9న కర్లపాలెంలో, 10న నల్లమోతువారిపాలెంలో, 14న పాతనందాయపాలెంలో, 15న పెదగొల్లపాలెంలో, 16న పెదపులుగువారిపాలెంలో, 17న పేరలిలో 20న సమ్మెటవారిపాలెంలో 21న తుమ్మలపల్లిలో, 22న యాజలిలో, 23న బుద్ధాంలో ఆయా గ్రామ సచివాలయాల వద్ద జరుగుతాయని చెప్పారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వం ద్వారా ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, ప్రజలకు అందిన సంక్షేమ పథకాల లబ్ధిని తెలియజేయాలని లబ్ధిదారుల పేర్లను ఫ్లెక్సీల ద్వారా ప్రదర్శించాలని ఎంపీడీఓ రాంబాబు తెలిపారు. గ్రామ వలంటీర్‌లు తమ పరిధిలోని గృహాలకు వెళ్లి వారికి అందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించటంతో పాటు ఈకేవైసీ నమోదు చేయాల్సి ఉంటుందని చెప్పారు. సచివాలయం వద్ద జరిగే సమావేశానికి గ్రామంలోని ప్రజా ప్రతినిధులతో పాటు ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొనే విధంగా అధికారులు కృషి చేయాలని ఎంపీడీఓ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎలీషాబాబు, హౌసింగ్ ఏఈ అన్వర్ బాషా, ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసరావు, పశు వైద్యాధికారి రేచల్ దివ్య, ఏపీఎం శ్రీనివాసులరెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషిచేయాలి

ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల



నిజాంపట్నం: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం శాఖల వారీగా ఎంపీపీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జడ్పీటీసీ నర్రాసుబ్బయ్య, ఎంపీటీసీ మోపిదేవి హరినాధబాబు, ఎంపీడీఓ నాగలక్ష్మి, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

చేతి పంపు ప్రారంభం



అంబేద్కర్ నగర్(వేమూరు): ప్రజలు దాహార్తి తీర్చిందేందుకు చేతి పంపులు ఎంతగానో ఉపయోగ పడతాయని ఎస్‌ఐ జె.నాగరాజు అన్నారు. వేమూరు మండల కేంద్రంలోని అంబేద్కర్ నగరంలో చేతి పంపును మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజన్ ఆఫ్ హోప్ మిషన్ సహకారంతో ఉచిత చేతి పంపు వేశారని, ఈ చేతి పంపు వల్ల ఎంతో మంది ప్రజల దాహం తీర్చుతుందన్నారు. విజన్ ఆఫ్ హోప్ మిషన్ సేవా స్వచ్ఛంద సంస్థ అధినేత ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అడ్వొకేట్ అమర్తలూరు రవీంద్ర బాబు ఆధ్వర్యంలో అనేకచోట్ల చేతిపంపులు వేసి ప్రజల దాహం తీర్చడం జరుగుతుందని ఆయన చెప్పారు. అడ్వొకేట్ ఎ.అశోక్ కుమార్, అబ్రహం, నాగరాజు, గర్నెపూడి సన్నీబాబు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి అయ్యప్పలకు అన్నవితరణ

రేపల్లె: ఇసుకపల్లిలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఈ నెల 9వతేదీ నుంచి డిసెంబర్ 19వరకు అయ్యప్పస్వామి, ఇతర మాలధారులకు అన్నప్రసాదం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప సేవాసమితి సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాతినేని కృష్ణప్రసాద్ జ్ఞాపకార్థం రాజుకాల్వ శ్రీనివాసరావు సహకారంతో ఏర్పాటు చేసిన అన్నప్రసాద కార్యక్రమంలో మాలధారులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పాలస్తీనా సంఘీభావ ప్రదర్శన

తెనాలి: సీపీఐ ఎంఎల్ లిబరేషన్, ముస్లిం సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో పాలస్తీనా సంఘీభావ ప్రదర్శనను నిర్వహించారు. స్థానిక శివాజీ సెంటరులోని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ కార్యాలయం, జామియా మసీదు వద్ద నుంచి ప్రదర్శనను ప్రారంభించారు. లిబరేషన్ దేశవ్యాపిత పిలుపులో భాగంగా చేపట్టిన ప్రదర్శన గాంధీచౌక్, బోసురోడ్డు, చినరావూరు పార్కు వరకు కొనసాగింది. యుద్ధం వద్దు... శాంతి కావాలి, పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడిని ఆపాలి అంటూ నినాదాలు చేశారు. సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మూర్తి, జిల్లా కార్యదర్శి ఎంపీ రాందేవ్, రాష్ట్ర కమిటీ సభ్యులు కళ్యాణకృష్ణ, లోకం భాస్కరరావు, ముస్లిం సంస్థల నేతలు పాల్గొన్నారు.

త్వరలో బాబూజీ బయోపిక్

సినీ దర్శకుడు దోనేపూడి దిలీప్ రాజా



మాట్లాడుతున్న దిలీప్ రాజా, పక్కన జగ్జీవన్‌రామ్ పాత్రధారి మిలటరీ ప్రసాద్

చెరుకుపల్లి: దేశనాయకుల జీవితాలను చలనచిత్రాలుగా రూపొందించటం ద్వారా యువతలో దేశభక్తి పెంపొందుతుందని సినీ దర్శకుడు ఏపీ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు దోనేపూడి దిలీప్ రాజా అన్నారు. చెరుకుపల్లి మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దిలీప్ రాజా మాట్లాడుతూ మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జీవిత చరిత్ర ఆధారంగా బాబూజీ అనే బయోపిక్‌ను నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. వాస్తవికతకు దగ్గరగా ఉండేందుకు గ్రామీణ ప్రాంతాలలో నాటి రోజులను గుర్తు చేసుకునేలా బయోపిక్‌ను నిర్మిస్తున్నామన్నారు. దీనిని చిత్రీకరించేందుకు మండలంలోని పలు ప్రాంతాలను పరిశీలించామని తెలిపారు. ఈ చిత్రంలో తెనాలికి చెందిన మిలటరీ ప్రసాద్ జగ్జీవన్ రామ్ పాత్రలో నటిస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో చిత్ర నిర్మాణానికి అన్ని వసతులు ఉన్నాయని నిర్మాతలు ఏపీలో చిత్రాలను నిర్మించటం ద్వారా జూనియర్ ఆర్టిస్టులకు ఉపాధి కల్పించినట్లు అవుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సినీ రంగాన్ని ఎంతో ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. గతంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిన్న నాటినాటి నుంచి మృతి వరకు వాస్తవ సంఘటనల ఆధారంగా బయోపిక్ నిర్మించామని, దీనికి దేశవ్యాప్తంగా విశేష ఆదరణ లభించిందన్నారు. ఇదేస్ఫూర్తితో బాబు జగ్జీవన్ రామ్ జీవిత చరిత్రను క్షుణ్ణంగా తెలుసుకుని మరో దృశ్య కావ్యాన్ని ప్రజల ముందుకు తీసుకొస్తున్నామని, 2024 జనవరిలో కొంత భాగాన్ని చెరుకుపల్లి పరిసర ప్రాంతాల్లో చిత్రీకరిస్తామన్నారు.

పోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన



పోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన కల్పిస్తున్న ఎఫ్‌సీఐ తాడేపల్లి కృష్ణాకెనాల్ డిపో మేనేజర్ వర్గీస్

తాడేపల్లిరూరల్: పోర్టిఫైడ్ బియ్యం వినియోగంలో అపోహలు వద్దని ఎఫ్‌సీఐ తాడేపల్లి కృష్ణాకెనాల్ డిపో మేనేజర్ వర్గీస్ అన్నారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఆహార సంస్థ ఆహార నిల్వల గోదాము, కృష్ణా కెనాల్ డిపో ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో భారతదేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లలో ఒకటైన ఆహార లోపాన్ని నిర్మూలించడానికి భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పోర్టిఫైడ్ బియ్యం వాడడం వలన రక్తహీనత, సూక్ష్మ పోషకాల లోపాలను నివారించవచ్చని తెలియజేశారు. కృష్ణాకెనాల్ ఎఫ్‌సీఐ క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ శశికళ మాట్లాడుతూ పిల్లలు, గర్భిణులు, బాలింతలకు కావాల్సిన ఐరన్, ఫోలిక్ ఆమ్లం, విటమిన్ బి12లు ఈ బియ్యంలో లభ్యమవుతాయని వివరించారు. ఆశా వర్కర్లు పోర్టిఫైడ్ బియ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. మెడికల్ ఆఫీస్ డాక్టర్ కిరణ్, సిహెచ్ గురుకుమార్, సి.ప్రూజా, ఉమాదేవి, ఎంపీహెచ్ఎస్ శ్రీనివాసరావు, ఎంపీహెచ్ఏ శ్రీనివాస్‌బాబు, తాడేపల్లి కేసీ డిపో సిబ్బంది, క్వాలిటీ సిబ్బంది, ఆశావర్కర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

వర్క్ ఎస్టిమేషన్లపై అవగాహన సదస్సు



వర్క్ ఎస్టిమేషన్ అవగాహన సదస్సులో పాల్గొన్న ఇంజినీరింగ్ సూపరింటెండెంట్ జి.బ్రహ్మయ్య

తాడేపల్లిరూరల్: మంగళగిరి, తెనాలి నియోజకవర్గాలకు సంబంధించి జరిగిన అభివృద్ధి పనులపై వర్క్ ఎస్టిమేషన్ అవగాహన సదస్సును దుగ్గిరాల గ్రామంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గుంటూరు జిల్లా ఇంజినీరింగ్ సూపరింటెండెంట్ జి.బ్రహ్మయ్య రెండు నియోజవర్గాల సచివాలయాల ఇంజినీర్లకు, అసిస్టెంట్ ఇంజినీర్లకు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ ప్రభుత్వం శరవేగంగా అభివృద్ధి పనులు చేస్తోందని, పనులు పూర్తయిన వెంటనే బిల్లులు చెల్లించేందుకు అవసరమైన వర్క్ ఎస్టిమేషన్ చేయడంలో కొంత జాప్యం జరుగుతోందని ప్రతి సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ప్రభుత్వం నియమించిందన్నారు. ఆయా సచివాలయాల్లో జరిగిన అభివృద్ధిపై వారికి అవగాహన ఉండాలని, ఎన్ని క్యూబిక్ మీటర్లు అభివృద్ధి చెందింది, ఒక రోడ్డు నిర్మించేటప్పుడు ఎంత పొడవు, ఎంత వెడల్పు నిర్మించారో పూర్తి వివరాలు తీసుకుని ఆయా సచివాలయాల్లో వర్క్ ఎస్టిమేషన్లు తయారు చేస్తే తొందరగా బిల్లులు చెల్లించడానికి అవకాశం ఉంటుందని, అలా బిల్లులు చెల్లించడం వల్ల మరిన్ని అభివృద్ధి పనులు చేయవచ్చని ఆయన అన్నారు. మంగళగిరి, తెనాలి నియోజకవర్గాల సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ



తెనాలిటౌన్: పట్టణ గాంధీనగర్‌లోని నరేంద్రకాలనీలో మున్సిపల్ ఉర్దూ పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. యోగా సభ్యులు చరసాని శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మీ చైతన్యల కుమారుడు వివిఎస్.రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కఠెవరం గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు గంపల శివనాగేశ్వరరావు విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేశారు. బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. హెచ్ఎం జరీనా బేగం, సాంబశివరావు, ఉపాధ్యాయులు సుజాత, మాధవి, శిరీషా పాల్గొన్నారు.

ఎన్‌జీ రంగాకు పుష్పాంజలి



తెనాలి: సీనియర్ పార్లమెంటేరియన్, రైతునాయకుడు ఎన్‌జీ రంగా జయంతి సందర్భంగా మంగళవారం అయితానగర్‌లోని ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. రంగా వ్యక్తిత్వాన్ని, ఆయన రైతులోకానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈదర వెంకట పూర్ణచంద్, కన్నెగంటి వెంకటేశ్వరరావు, ఈదర పిచ్చయ్యచౌదరి, కన్నెగంటి శివ, అంచే ప్రసాద్, ఈదర రాజా, శాఖమూరి చలపతిరావు, గుమ్మడి ప్రసాద్, ఈదర శ్రీనివాసరావు, ఈదర రమణ, జి.లచ్చిబాబు, మేకల చిట్టిబాబు, ఈదర శివశీను, తాళ్లూరి కిషోర్, తాళ్లూరి కామయ్య, కన్నెగంటి వెంకట్రావు, జెట్టి భాస్కరరావు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి హనుమంతరావు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి హనుమంతరావు

కర్లపాలెం: పాడి రైతులు కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా తీసుకుంటున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి హనుమంతరావు తెలిపారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పశు వైద్యురాలు రేచల్ దివ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో కర్లపాలెం యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో 40మంది రైతులకు పశు కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా పశువుల పోషణ నిర్వహణ ఖర్చుల నిమిత్తం ఒక్కొక్క రైతుకు రూ.50వేలు రుణాలను మంజూరు చేశారు. ఈ సభలో హనుమంతరావు మాట్లాడుతూ రైతులు మేలుజాతి పశువులను పెంచుకోవాలని సూచించారు. డాక్టర్ రేచల్ దివ్య మాట్లాడుతూ మండల పరిధిలోని కర్లపాలెం, ఏట్రవారిపాలెం, బుద్ధాం, గణపవరం, పేరలి, తుమ్మలపల్లి, చింతాయపాలెం గ్రామాలలోని 40మంది రైతులకు ఒక్కొక్కరికి రెండు పశువులకు రూ.50వేల చొప్పున రుణం మంజూరు చేశారని తెలిపారు. రైతులు సకాలంలో తిరిగి బ్యాంకులకు చెల్లిస్తే 70పైసలు వడ్డీ పడుతుందని ఆమె చెప్పారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శివకృష్ణ, పశువైద్యులు ఎం.మహేష్, లైవ్ స్టాక్ అసిస్టెంట్ రాజేష్, పాండు రంగారావు, యూనియన్ బ్యాంకు మేనేజర్ శైలేష్, అసిస్టెంట్ మేనేజర్ మనోజ్, బాపట్ల పశువైద్యులు శంకర్ రావు, రైతులు ఉన్నారు.

ఫెన్సింగ్‌లో చింతాయపాలెం విద్యార్థులకు బంగారు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులతో హెచ్ఎం వెంకట కృష్ణరాజు, పీడీ గోపి

కర్లపాలెం: రాష్ట్రస్థాయిలో జరిగిన ఫెన్సింగ్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరిచి బంగారు, కాంస్య పతకాలు సాధించారని చింతాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం టి.వెంకటకృష్ణరాజు తెలిపారు. మంగళవారం పాఠశాల ఆవరణలో ఫెన్సింగ్ క్రీడాకారులకు అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా పీడీ గోపి మాట్లాడుతూ ఈనెల 1నుంచి 3వ తేదీవరకు నంద్యాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో 67వ రాష్ట్రస్థాయి అండర్-19 బాలబాలికలకు ఫెన్సింగ్ పోటీలు జరిగాయని తెలిపారు. ఈ పోటీలలో బాలుర విభాగంలో 10వ తరగతి చదువుతున్న మద్దసాని భార్గవకృష్ణ బంగారు పతకం, 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు రెట్టా ఉపేంద్ర, అక్కల ప్రసన్నాంజనేయరెడ్డి, కేసన శివమణికంఠ, కావూరి మిథునసాయికుమార్ కాంస్య పతకాలు సాధించారని తెలిపారు. బాలికల విభాగంలో 10వ తరగతి చదువుతున్న పందరబోయిన అంజలి బంగారు పతకం, 9వ తరగతి విద్యార్థి ఎలికా కోకిల, బంగారు పతకం సాధించగా 10వ తరగతి విద్యార్థిని కుర్రా పావని, 8వ తరగతి విద్యార్థి కొమ్మరగిరి పావని, కాంస్య పతకాలు సాధించారని తెలిపారు. క్రీడాకారులను ఉపాధ్యాయులు అభినందించారు.

14న ఎంసీఏ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం

రేపల్లె: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 14వతేదీన పట్టణంలోని గుత్తికొండ లక్ష్మీనారాయణ కల్యాణ మండపంలో ఎంసీఏ ఆధ్వర్యంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు కోగంటి రత్నాకరబాబు తెలిపారు. స్థానిక మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్(ఎంసీఏ) హాలులో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వేడుకల్లో భాగంగా 9వ తేదీన విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు, 1 నుంచి 5వతరగతి విద్యార్థులకు వారికి నచ్చిన అంశంలో, 6, 7, 8 తరగతులవారికి పల్లె వాతావరణం, 9, 10తరగతుల విద్యార్థులకు ప్రపంచశాంతి అంశాలపై డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా 14వ తేదీ మధ్యాహ్నం సోలో, గ్రూపు విభాగాలలో శాస్త్రీయ, జానపద, అభ్యుదయ, దేశభక్తి నృత్య పోటీలు నిర్వహిస్తామన్నారు. పాశ్చాత్య ధోరణులతో కూడిన పాటలకు అనుమతిలేదని చెప్పారు. 5వతరగతి వరకు సబ్ జూనియర్స్‌గాను, 6, 7, 8 తరగతుల విద్యార్థులు జూనియర్స్‌గాను, 9, 10 తరగతుల విద్యార్థులు సీనియర్స్‌గా పరిగణించటం జరుగుతుందన్నారు. ప్రతి పోటీలో గెలుపొందినవారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ విభాగాలలో బహుమతులు అందజేస్తామని చెప్పారు. పోటీలలో పాల్గొనదలచిన విద్యార్థులు తమ పాఠశాల హెచ్ఎం అనుమతితో పాల్గొనాలని చెప్పారు. పూర్తి వివరాలకై ఎంసీఏ కార్యాలయంలోగాని, 79811 47953 నంబరులో గాని సంప్రదించాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణ చేసిన వారికే మాదిగల మద్దతు

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మయ్య మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మయ్య మాదిగ

తెనాలిటౌన్: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేసిన రాజకీయ పార్టీకే మాదిగల మద్దతు ఉంటుందని, వర్గీకరణ కోసం పోరాటం చేస్తునే సంక్షేమం, సమగ్రాభివృద్ధి, రాజకీయ వాటా కొరకు మాదిగలు ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ తెలిపారు. కొత్తపేటలోని ఎన్‌జీవో కళ్యాణ మండపంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో-కన్వీనర్ పొన్నెకంటి రమేష్‌మాదిగ అధ్యక్షత వహించారు. సమావేశంలో బ్రహ్మయ్య మాదిగ మాట్లాడుతూ మాదిగల ఆశ, ఆకాంక్ష, ఎస్సీ వర్గీకరణ అని పేర్కొన్నారు. ఈ నెల 11వ తేదీన హైదరాబాద్‌లో జరిగే మాదిగల విశ్వరూప మహాసభలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొంటారని చెప్పారు. పార్లమెంట్‌లో వర్గీకరణ అంశంపై చట్టం చేయాలని బ్రహ్మయ్య మాదిగ డిమాండ్ చేశారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రమేష్ మాదిగ, ఏటుకూరి విజయ్‌కుమార్ మాదిగ, దొండపాటి సుధాకర్, పానుగంటి షాలేమ్ రాజు, డొక్కా జార్జి, మహిళ నాయకులు లుక్కా బుజ్జి, ప్రశాంతి, నాగమ్మ, యువకులు జాన్‌పాల్, రమేష్, సంతోష్, జాన్‌వెస్లీ, ఆశోక్ పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ టోర్నమెంట్‌లో రావెల విద్యార్థినుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం నాగమణి, ఆయుష్ వైద్యాధికారిణి రేష్మ, శిక్షకుడు రాకేష్

రావెల(తాడికొండ): రాష్ట్రస్థాయిలో నిర్వహించిన 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా యోగా టోర్నమెంట్‌లో తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా జట్టును ప్రథమ స్థానంలో నిలిపారని పాఠశాల హెచ్ఎం నాగమణి, ఆయుష్ వైద్యశాల వైద్యాధికారిణి డాక్టర్ రేష్మ తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసం గ్రామంలో ఈనెల నిర్వహించిన అండర్-17 యోగా పోటీలకు బాలికల విభాగంలో విద్యార్థులు పాల్గొనగా, వారిలో తమ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు జట్టును విజయ పథంలో నడిపించడం తమ పాఠశాలకు గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థినులు పేరుబోయిన వెంకట త్రివేణి, మొఘల్ ఖాజాబీ, పేరుబోయిన భార్గవి, మొక్కల అక్షయలతో పాటు వారికి శిక్షణ అందించిన శిక్షకుడు అన్నవరపు రాకేష్‌ను హెచ్ఎం నాగమణి, వైద్యాధికారిణి డాక్టర్ రేష్మలు అభినందించారు.

ఆహూతులను అలరించిన లలితా చంద్రశేఖర్ గానం

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ సంగీత సంస్థ శ్రీసీతారామ గానసభ శాస్త్రీయ సంగీత ఉత్సవాల్లో భాగంగా రెండోరోజైన మంగళవారం సాయంత్రం విశాఖపట్నంకు చెందిన ప్రముఖ గాయని వీరఘంట లలితా చంద్రశేఖర్ గాత్రకచేరీ ఆహూతులను అలరించింది. ప్రధానంగా మైసూర్ వాసుదేవాచారి కీర్తన, త్యాగరాజస్వామి కీర్తనలను శృతిపర్వంగా, లయబద్ధంగా ఆలపించారు. వీరి గాత్రానికి విజయనగరంకు చెందిన సోదరులు మహాదాసు నీలాద్రి వయోలిన్‌పై, మహాదాసు ఏడుకొండలు మృదంగంపై సహకరించారు. గానసభ అధ్యక్షులు పిరాట్ల రమణి, కార్యదర్శి దుర్భా హరిబాబు, కార్యవర్గ సభ్యులు పర్యవేక్షించారు.